

పుస్తకంతో మమేకం
సర్కారు కొలువే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలోని యువత గ్రూప్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల కావడంతో గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. 8లో▸



ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సన్మానించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు మంత్రి సీతక్క రాక

చెన్నూర్: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుక్రవారం చెన్నూర్‌లో పర్యటించనున్నారు. మున్సిపల్ పరిధిలోని గెర్రెకాలనీలో రూ.31కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు.

పోలీసులు అప్రమత్తం



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జన్నారం: జైనూర్ మండలంలో జరిగిన సంఘటన దృష్ట్యా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తం అయ్యారు. రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు గురువారం మండలంలోని కవ్వాల్, కొత్తపేట, కొలాంగూడ, కిష్టాపూర్, లోతొర్రె, దేవునిగూడ గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఆదివాసీ సంఘాల నాయకులతో మాట్లాడారు. అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని సూచించారు. జైనూర్ సంఘటన నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూడాలని తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కాశికంకాలి, మాజీ అధ్యక్షుడు రాజుకుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు గంగుపటేల్, వసంత్, ఆనంద్, ప్రధాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలు వదంతులను నమ్మద్దు

సోషల్ మీడియాలో, ఇతరత్రా వదంతులను నమ్మవద్దని సీపీ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, ఆదివాసీ సంఘ నాయకులు సంయమనం పాటించాలని, సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జైనూర్ మహిళపై దాడి ఘటనలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితునికి త్వరగా శిక్ష పడేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాల నుంచి పంటల సంరక్షణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలని, రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, పంట పొలాల్లో ఎరువులు, మందులు పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలని పేర్కొన్నారు. వరి పంటలో ప్రస్తుతం దుబ్బ చేసే దశలో ఉందని, బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించే అవకాశం ఉందని, 0.2 గ్రాములు పొంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని, కాండం కుళ్లు రావడానికి అవకాశం ఉన్నందున 2.5 గ్రాము కార్బండజిమ్, మ్యాంకోజేబ్ శిలీంద్రనాశక మందు/ఒక మిల్లీలీటరు, మైసిస్ వాలిడామైసిన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించి ఉన్నట్లయితే నత్రజని మోతాదుకు మించి ఉపయోగించకూడదని తెలిపారు.

సీపీఎం శాఖ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సంకె రవి

పాతమంచిర్యాల: ప్రజా సమస్యలే ఎజెండాగా జిల్లాలోని మండలాల్లో ఈ నెల 8 నుంచి 30వరకు సీపీఎం శాఖ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లలో నిర్వహించిన పోరాటాలు, ఫలితాలపై చర్చ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు, భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకుని కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, పట్టణ నాయకులు అరిగెల మహేష్, మిడివెళ్లిరాజు, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు.. రక్షణ కరువు!




ఈ చిత్రంలో కనిపించేది జిల్లా కేంద్రంలోని హమాలీవాడ వైపు వచ్చే ప్రధాన దారి. ఇక్కడ నిర్మించిన బ్రిడ్జి వంతెనపై నుంచి నీరు పొంగి రోడ్డుపైకి వస్తోంది. దీంతో టూటౌన్ వాసులకు బుధవారం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పట్టణంలో చాలా కాలనీల్లో వరద నీరు రోజుల తరబడి నిలుస్తోంది. వర్షం పడినప్పుడు ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా వరద వెళ్లాల్సి ఉన్నా ఆయా మార్గాల్లో వెలిసిన నిర్మాణాలు ఆటంకంగా మారాయి.



జిల్లా కేంద్రం మంచిర్యాలలో ఉన్న పోచమ్మ కుంట

- స్పష్టమైన హద్దుల్లేక ఇబ్బందులు
- పట్టణాల్లో కుంచించుకుపోతున్న కుంటలు
- ప్రతీ చెరువును నోటిఫై చేస్తేనే మేలు



మంచిర్యాలలోని గూగుల్ మ్యాపులో చెరువులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హైదరాబాద్ తరహాలో జిల్లాల్లోనూ హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు సూచించిన నేపథ్యంలో జిల్లాలో చెరువుల రక్షణకు పూనుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఇప్పటికే పట్టణాల్లో అనేక చెరువులు, వాటి వాస్తవ విస్తీర్ణం కంటే తక్కువగా ఉంది. వీటిని పూర్తి స్థాయిలో సర్వే చేయాల్సిన అవసరం ఉంది. కొద్దిపాటి వర్షానికే కాలనీల్లో నీరు చేరుతోంది. వరదలు వస్తున్నాయి. పట్టణాలు ఏర్పడకముందు నుంచి ఉన్న చెరువులు, కుంటలు కుంచించుకుపోవడం, వరద నీరు రోడ్లపై పారడం జరుగుతోంది. కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో నాలాలు పొంగి పట్టణాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగు నీటి కాలువలు, వరద కాలువలు, వాగులు, కుంటలు ఎక్కడికక్కడ ఇబ్బందికరంగా మారాయి. దీంతో పట్టణాల్లో భవిష్యత్‌లో వరదలు ముంచెత్తకుండా ఉండాలంటే వాగులు, కుంటలు, చెరువులను కాపాడుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇటీవల పలువురు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో గతంలో ఉన్న శాటిలైట్ మ్యాపుల ఆధారంగా భూరికార్డులు, ప్రస్తుత చెరువుల విస్తీర్ణం సరిపోల్చుతూ పూర్తి స్థాయిలో సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటికే హైదరాబాద్, వరంగల్ వంటి మహానగరాల్లో ఈ తరహా సర్వే మొదలైంది. తాజాగా అన్ని జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లోనూ చెరువుల రక్షణకు రాష్ట్ర స్థాయిలో రంగం సిద్ధం చేస్తోంది.

పట్టణాల్లో వరద సమస్యలు

జిల్లాలోని ఏడు మున్సిపాల్టీలు మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో వానాకాలంలో వరదల సమస్యలు ఏర్పడుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు నాలాల గుండా నీరు వెళ్లే మార్గాలు కుంచించుకుపోయి ఉండి పొంగి పొర్లుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. జిల్లా నుంచి మొదలు అన్ని పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఈ సమస్య ఏర్పడుతోంది. ఎత్తువైపు ఉన్న కాలనీల్లో మినహా మిగతా చోట్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక ప్రధాన మార్కెట్ ఏరియాలు, ప్రధాన రోడ్లు జలమయం అవుతున్నాయి. డ్రెయినేజీ కాలువలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో సమీప ఇళ్లలోకి నీరు చేరుతోంది. గొలుసుకట్టు చెరువుల ప్రవాహ మార్గాలు దెబ్బతినడంతోనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఎక్కడికక్కడ సర్వే చేసి ఆక్రమణలు తొలగించాల్సి ఉన్నా ఆక్రమణదారుల అభ్యంతరాలతో నిలిచిపోతున్నాయి.

నోటిఫై చేస్తేనే రక్షణ

జిల్లాలో సాగునీటి పారుదల శాఖ బెల్లంపల్లి డివిజన్‌లోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో 625 చెరువులు ఉన్నాయి. వీటితోపాటు కడెం డివిజన్ పరిధిలో ఉన్న జన్నారం మండలంలో 42 చెరువులున్నాయి. వీటిలో జిల్లా మొత్తంగా 363 సీజనల్ చెరువులు ఉన్నాయి. వీటిలోనే నీటి లభ్యత ఉండడంతో మత్స్యకారులు చేపల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. మిషన్ కాకతీయ పథకం సమయంలో కేవలం పూడిక తీత, కట్టల మరమ్మతులకే పరిమితం అయ్యారు. చాలా చోట్ల చెరువుల వాస్తవ విస్తీర్ణంపై ఇప్పటికీ స్పష్టత లేదు. సర్వేనంబర్లు, సమీప పట్టాదారులతో ఉన్నాయి. ఇలాంటివన్నీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో ప్రతీ చెరువు సర్వే చేసి హద్దులు గుర్తించి నోటిఫై చేస్తేనే రక్షణ కలిగే అవకాశం ఉంది.

'లారీ ఓనర్స్' సొసైటీపై విచారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'లారీ ఓనర్స్ ట్రాన్స్‌పోర్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లి.మంచిర్యాల'లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు అందడంతో జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం విచారణ అధికారిగా సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఏవీఆర్జీ ప్రసాద్‌రావును నియమించారు. వారం రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నస్పూర్ కేంద్రంగా ఉన్న లారీ యజమానుల సహకార సంఘంలో ప్రస్తుతం 200మందికి పైగా సభ్యులు ఉన్నారు. గతంలో ఉన్న సంఘంతో విభేదించి రెండుగా విడిపోయింది. గత కొంతకాలంగా ఈ సొసైటీలో సక్రమంగా రికార్డులు చూపించకపోవడంతోపాటు అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులకు ఓ సభ్యుడు ఫిర్యాదు చేశాడు. సంఘ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకపోవడం, నిధుల దుర్వినియోగం, ధాన్యం కొనుగోలు సమయంలో లారీల రవాణాపై కొందరు పాలకవర్గంలో ఉన్నవారు అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలోనే సొసైటీపై విచారణ చేపట్టనున్నారు.

బంద్‌పై సీపీ ఆరా



సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

దండేపల్లి: జైనూర్ ఘటనకు నిరసనగా దండేపల్లి మండలంలో ఆదివాసీ సంఘాలు గురువారం బంద్‌కు పిలుపునిచ్చాయి. మండలంలో బంద్ ప్రభావంపై రామగుండం సీపీ శ్రీనివాసులు ఆరా తీశారు. జన్నారం నుంచి తిరిగి వస్తుండగా దండేపల్లి మండలంలోని మేదరిపేటలో కొద్దిసేపు ఆగారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్‌తో మాట్లాడారు. మండలంలో ఆదివాసీలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూడాలని సూచించారు.

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తొలగనున్న కరెంట్ కష్టాలు



మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాకు సర్కారు నిర్ణయించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత విద్యుత్ అమలుకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తున్నా అవి ఎటూ సరిపోకపోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపు గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలోనే గృహజ్యోతి పథకంలో 200యూనిట్లలోపు ఉన్న వారికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం బడుల్లో అమలుకు ఉత్తర్వులు జారీ చేయడంతో కష్టాలు తొలగనున్నాయి.

విద్యుత్ బిల్లులకే గ్రాంట్లు

బడుల నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లో నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ప్రతీ ఏడాది స్కూళ్లకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాంపొజిటివ్ స్కూల్ గ్రాంటు రెండు విడతల్లో మంజూరవుతాయి. ఇందులో సగం వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండగా మరుగుదొడ్ల శుభ్రం, సామగ్రి కొనుగోలు, తాగునీరు, చిన్నపాటి మరమ్మతులు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు, జెండా పండుగలు ఇతరత్రా అవసరాల నిమిత్తం వినియోగిస్తున్నారు.

ఇక్కట్లు తొలగినట్లే..!

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమల్లోకి రావడంతో ఇబ్బందులు తొలగనున్నాయి. జిల్లాలో 855 విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అమలు కానుంది. ఇందులో 727 పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో మాత్రమే కరెంట్ మీటర్లు ఉన్నట్లు పోర్టల్‌లో నమోదయ్యాయి. 58 పాఠశాలల్లో విద్యుత్‌మీటర్లు లేనట్లు గుర్తించారు. పాఠశాలల్లో విద్యుత్ మీటర్ నాట్ అవలేబుల్, బిల్ నాట్ జనరేట్ సమస్యలు వెలుగు చూశాయి. వేసవిలో విద్యుత్ వినియోగం అధికం కావడంతో బిల్లులు తడిసిమోపెడయ్యేవి. విద్యుత్‌శాఖ విద్యాసంస్థలను కేటగిరి-7 కింద పరిగణలోకి తీసుకుని యూనిట్‌కు రూ.8.30 చార్జీలు వేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో పాఠశాలలకు వినియోగించిన విద్యుత్‌ను బట్టి రూ.250 నుంచి రూ.5వేలకు పైన బిల్లు చెల్లిస్తూ వస్తున్నారు. విద్యాసంస్థల విద్యుత్ వినియోగం, బిల్లుల మొత్తం, జారీ అయిన బిల్లులు, చెల్లించాల్సిన బకాయిలు సమాచారంతో కూడిన నివేదికలను వెబ్‌పోర్టల్ నమోదు చేయడంతో ఎప్పటికప్పుడు చూసుకునే వీలుంటుంది. ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు.

భావితరాలను తీర్చిదిద్దడం టీచర్లకే సాధ్యం



సన్మానం అనంతరం ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్య, అధికారులు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థి వ్యవస్థ నుంచి సన్మార్గంలో నడిపిస్తూ భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు డీఈవో ఎస్.యాదయ్య, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి అధికారి నీరటి రాజేశ్వరిలతో కలిసి హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనేక మంది ఉన్నత స్థాయిలో నిలువడంలో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు నేర్పించిన పాఠాలే మూలమని, ఉపాధ్యాయులు, పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని అన్నారు. విద్యార్థులు సహాయం అందించే అలవాటు చేయాలని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన 43 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

జిల్లాలో 10.4మిల్లీమీటర్ల వర్షం



కొట్టుకుపోయిన మామడ తాత్కాలిక వంతెన

మంచిర్యాలఅగ్రికల్చర్/వేమనపల్లి: జిల్లాలో 10.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వేమనపల్లి మండలంలో 46.4 మిల్లీమీటర్లు, కన్నెపల్లిలో 27.8, భీమినిలో 25, మంచిర్యాలలో 13.8, కోటపల్లిలో 13.5, జైపూర్‌లో 13, నస్పూర్‌లో 9.2, చెన్నూర్‌లో 5.4, భీమారంలో 4.9, మందమర్రిలో 6.5, నెన్నెలలో 6, బెల్లంపల్లిలో 3.4, దండేపల్లిలో 3.6, హాజీపూర్‌లో 2.7, లక్సెట్టిపేటలో 1.7, కాసిపేటలో 1.9, తాండూర్‌లో 1.8, జన్నారంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 802.1 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 885.4 మిల్లీమీటర్లు కురిసింది. సగటున 10శాతం అధికంగా నమోదైంది. కాగా, వేమనపల్లి మండలంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. నీల్వాయి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో మత్తడి దూకుతోంది. మామడ, నీల్వాయి మధ్యలో ఉన్న ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో నీల్వాయి, మామడ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కనీసం ఎడ్లబండ్లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

గురుకుల పార్ట్‌టైం టీచర్ల నిరసన



నిరసనలో గురుకుల పేరెంట్స్, పార్ట్‌టైమ్ టీచర్లు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో నుంచి తొలగించిన గెస్ట్ అసోసియేట్స్, పార్ట్‌టైమ్ టీచర్లు, సిబ్బందిని బేషరతుగా తిరిగి చేర్చుకోవాలని, మూడు నెలల పెండింగ్ వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విధుల్లో నుంచి తొలగించిన అధ్యాపకులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ పేద, ఎస్సీ విద్యార్థులు చదువుకునే సంక్షేమ గురుకులాలను నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గురుకుల విద్యార్థుల భవిష్యత్ అగాధంలోకి నెట్టారని, బోధన నిలిచిపోయి ఆగమాగం అవుతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం జోన్ గురుకులాల జోనల్ అధికారి అరుణకుమారి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పూదరి నాగేష్, ముఖ్య బాధ్యులు పెరుగు తిరుపతి, దాగం మహేష్, గెస్ట్ అసోసియేట్స్, పార్ట్ టైమ్‌టీచర్లు, సిబ్బంది, ఇతర ప్రాంతాల గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ లోపాన్ని అధిగమించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా పోషణ లోపాన్ని అధిగమించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి ఈ నెల 30 వరకు నిర్వహించే పోషణ్ మహ్-2024 కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శామ్-మామ్ లోపాలు గల పిల్లలను గుర్తించి వారు సాధారణ స్థితికి వచ్చేలా సకాలంలో పౌష్టికాహారం అందించాలని తెలిపారు. అనంతరం అందరితో పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవోలు విజయలక్ష్మి, రేష్మ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త రజిత, ఉమెన్ హబ్ టీం, సూపర్‌వైజర్లు, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంపై సీఎంకు బహిరంగ లేఖ



లేఖను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల-అంతర్గాం గోదావరి నదిపైనే బ్రిడ్జి నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసినట్లు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణంతో హైదరాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ప్రయాణం చేసే వారికి 18 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. ఈ బ్రిడ్జిని హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద నిర్మించడానికి స్థానిక ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల నిర్మాణ వ్యయం రూ.450 కోట్ల ఖర్చుతోపాటు ఎనిమిది కిలోమీటర్ల మేరకు భూసేకరణ చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇవన్నీ చేసినా పెద్దపల్లి వెళ్లేందుకు ఐదు కిలోమీటర్లు మాత్రమే తగ్గుతుందని తెలిపారు. మంచిర్యాల నుంచి అంతర్గాం మధ్యలో గోదావరి నదిపై బ్రిడ్జిని నిర్మిస్తే, అంతర్గాం నుంచి ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు వేసి సిద్ధంగా ఉందని, బ్రిడ్జి నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేసే అవకాశం ఉందని, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లావాసులకు కరీంనగర్ వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ.164 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, కౌన్సిలర్లు సుంకరి శ్వేత, హఫీజా బేగం, నాయకులు సుంకరి రమేశ్, తాజుద్దీన్, పంబల ఎర్రన్న, హాజీపూర్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, మందపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్
- హాజీపూర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ హెచ్చరించారు. గురువారం ఆయన హాజీపూ ర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ఇన్, అవుట్ పేషెంట్ల వివరా లు, మందుల నిల్వలపై వైద్యాధికారి డాక్టర్ లహరిని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ స్టోరేజీని పరిశీలించి అత్యవసర మందులతో పాటు కుక్క, పాముకాటు ఇంజక్షన్లతోపాటు చిన్నారులకు వేసే ప్రతీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచేలా చూడాలని అన్నారు. పీహెచ్‌సీలో రోగులకు పడకలు సిద్ధంగా ఉండాలని, ఆపరేషన్ థియేటర్‌లో సౌకర్యాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని అన్నారు. మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ జయమేరి, హెచ్‌ఈఓ రఘుపతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి యువకుడి మృతి


శ్రావణ్‌కుమార్ (ఫైల్)

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన తలాండి శ్రావణ్‌కుమార్ (27)చెరువులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపల్లి గ్రామంలో బుధవారం బంధువులది సంవత్సరీకం కార్యక్రమానికి శ్రావణ్ వచ్చాడు. స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లగా లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. గమనించిన తోటి బంధువులు కుటుంబసభ్యులు, పోలీసులకు అందించారు. వారు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం ఈతగాళ్లతో గాలించగా శ్రావణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): ఇంటి పరసరాల్లో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తాండూర్ మండలం తంగళ్ళపల్లికి చెందిన కోయ గణేశ్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పెరటితోటలో తనిఖీ చేయగా నాలుగు గంజాయి మొక్కలు లభించాయని, వాటి విలువ రూ.40 వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఈమేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సమాచారం తెలిస్తే సెల్ 8712656575 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడి మృతిచెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గంగాపూర్‌కు చెందిన వశాకే శంకర్ (72) కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పని నిమిత్తం రెబ్బెనకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయల్దేరాడు. మార్గమధ్యలోని మండలకేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్టేషన్ మాస్టర్ అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య తానుబాయి, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

దాడిచేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ ఎజాజ్ తన బావమరిది అయిన షేక్ మునాక్‌పై దాడి చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తరచూ తన ఇంటికి వస్తూ గొడవలకు దిగుతున్నట్లు తెలిపారు.



నిర్మల్‌లోని గ్రంథాలయంలో సన్నద్ధమవుతున్న యువత (ఫైల్)

పుస్తకంతో మమేకం

- సర్కారు కొలువే లక్ష్యం..
- గ్రూప్స్‌పై ఉమ్మడి జిల్లా యువత గురి
- గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ

నిర్మల్‌ఖిల్లా: సర్కారు కొలువే లక్ష్యంగా గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సిద్ధమవుతున్నారు. రాత్రి,పగలు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదల చేయడం, టీజీపీఎస్సీ..అక్టోబర్ 21 గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు, నవంబర్, డిసెంబర్‌లో గ్రూప్–2 గ్రూప్–3 పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదువుతూ ప్రిపేరవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఈ పోటీ పరీక్షలకు దాదాపు 50 వేలకు మందికి పైగా యువత సన్నద్ధమవుతున్నారు. దాదాపు 40 శాతం మందికిపైగా గ్రంథాలయాల్లో, అద్దెకు తీసుకున్న గదుల్లో ప్రిపేరవుతుండగా మరో 30 శాతం మంది హైదరాబాద్, వరంగల్ తదితర నగరాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. గత జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఉమ్మడి జిల్లా నుంచి 15వేలకుపైౖ అభ్యర్థులు రాశారు. ఇందులో అర్హత సాధించినవారికి వచ్చే అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. గ్రూప్–1తోపాటు గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలు నిర్వహించనుండడంతో తదనగుణంగా ప్రిపేరవుతున్నారు.

గురిపెడితే కొలువు సులువే..

నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కేంద్ర గ్రంథాలయాలతో పాటు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లు నిరుద్యోగుల కోసం దోహదపడుతున్నాయి. ఇందులో ఉద్యోగాలకు శిక్షణ పొందుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కష్టపడితే ఉద్యోగ సాధన తర్వాత భవిష్యత్ బాగుంటుందని, ప్రభుత్వ కొలువుల్లో ఎలాగైనా సాధించాలని తపనతో శ్రమిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే పోటీ పరీక్షల్లో నెగ్గి సర్కారు కొలువు సాధించడం కష్టమేమీ కాదని గత విజేతలు పేర్కొంటున్నారు.

జాబ్ కాలెండర్ ప్రకటనతో ఉత్సాహం..

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదలతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. నిర్ణీత గడువులోనే ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తికానున్నట్లు వారి నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది. పరీక్ష నిర్వహణ తేదీలు ప్రకటించడంతో ప్రణాళిక బద్ధంగా ప్రిపేర్ అవుతున్నారు. వరుస పోటీ పరీక్షల నేపథ్యంలో కోరుకున్న కొలువు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్, పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో వాటిని వినియోగించుకుంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదవాలి. సిలబస్ ఆధారిత ప్రిపరేషన్ అవసరం. సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. తెలంగాణ ఉద్యమం, చరిత్ర, దేశ, రాష్ట్ర భౌగోళిక స్వరూపాలు, పర్యావరణం సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను ప్రాధాన్యతనిచ్చి చదవాలి.

– రమణాగౌడ్ గొడిసెల, పోటీ పరీక్షల నిపుణుడు

ఒత్తిడికి గురికావొద్దు



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో మానసికంగా ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఆందోళన, భయం లేకుండా ప్రశాంతంగా చదవాలి. మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ప్రిపరేషన్ కొనసాగించాలి. లక్ష్యంపై దృష్టిసారించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

– వెల్మల మధు, అసోసియేట్ ప్రొఫెసర్, నిర్మల్

ఏజెన్సీలో అలజడి!

- పరిస్థితిని ముందే అంచనా వేయలేదా?
- దాడుల తర్వాత తేరుకున్న వైనం..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహిళపై దాడి ఘటన చినికి చినికి గాలివానగా మారి రెండు ప్రధాన వర్గాల్లో దాడులు చేసే స్థాయికి చేరింది. పచ్చని అడవుల్లో ప్రశాంత జీవనానికి మారుపేరుగా ఉండే గూడేల్లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనతో శాంతిభద్రతలు చక్కబెట్టేందుకు ఉమ్మడి జిల్లా పోలీసు యంత్రాంగం, ఇతర జిల్లాల ప్రత్యేక బలగాలను మోహరించాల్సి వచ్చింది. చివరికి రాష్ట్ర అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇరువర్గాల మధ్య సున్నితమైన అంశం కావడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంతో వ్యవహరించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎస్పీలు, ఓ డీసీపీతోపాటు మరో ఇద్దరు ఎస్పీలు, ఓ డీసీపీ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సమన్వయం పాటించేందుకు ఇరువర్గాలతో చర్చించారు. ఆంక్షలు అమలు చేస్తూ ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్న మరోవర్గం ఆస్తులపైనా దాడులు జరిగాయి. ఈ పరిస్థితిని పోలీసు యంత్రాంగం ముందే అంచనా వేయలేకపోయిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏజెన్సీలో జరిగిన ఘటనలు గుర్తున్న పోలీసు అధికారులెవరైనా ముందస్తు చర్యలు తీసుకుంటారు. కానీ మరోసారి పరిస్థితి చేయిదాటే వరకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. బాధిత మహిళపై దాడి జరిగిన మూడు రోజుల వరకు రోడ్డు ప్రమాదంగానే భావిస్తూ, వాస్తవ పరిస్థితిని తెలుసుకోలేకపోయారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పోలీసు యంత్రాంగం మాత్రం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.

ప్రశాంత అడవిలో..

ఏజెన్సీలో జరిగిన పలు ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. శాంతిభద్రతలు నెలకొలడంలో సమస్యలు తెచ్చాయి. 2017లో ఆదివాసీ, లంబాడా వివాదంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌పై దాడి చేసి, కలెక్టర్ కారు అద్దాలు, ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఉట్నూరు, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆ కేసుల్లో పలువురు ఆదివాసీలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై సీరియస్‌గా తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్పీలను బదిలీ చేసింది. ఏజెన్సీలో పరిస్థితిని చక్కబెట్టడంలో విఫలమయ్యారనే కారణంగా ఆ స్థానాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో మొదలైౖ వివాదం ఇతర జిల్లాలకు వ్యాప్తి చెందడంతో పరిస్థితి అదుపులోకి వచ్చేందుకు నెలల సమయం పట్టింది. ఆ సమయంలోనూ ఇంటర్నెట్ నిషేధంతోపాటు అనేక ఆంక్షలు అమలయ్యాయి.

- 2019లో ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో ఓ దళిత మహిళను ముగ్గురు వ్యక్తులు దారుణంగా అత్యాచారం చేసి చంపేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కుదిపేసింది. అప్పట్లో ఈ ఘటనపై జైనూరు కేంద్రంగానే స్థానికులు పెద్దఎత్తున ధర్నాలు, నిరసనలు చేపట్టారు. దీంతో ప్రత్యేక కోర్టులో విచారణ జరగగా నిందితులకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. కొద్దిరోజులకు గొడవ సద్దుమణిగింది.

అంచనా వేయలేదా?

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏజెన్సీలో పరిస్థితి ఎప్పటికప్పుడు చేయిదాటకుండా చూస్తున్నారు. ఆయా సంఘాల, నాయకుల ధర్నాలు, నిరసనలు, బంద్‌లకు పిలుపునిస్తే నిఘా వ్యవస్థతో సమాచారం తీసుకుని ఆదిలోనే నిలిపివేస్తున్నారు. వీటితోపాటు పాలన పరంగా మార్పులు తెచ్చారు. ఏజెన్సీలో 'పెసా' చట్టాన్ని అమలుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. పోలీసులు ఆదివాసీలకు మరింత దగ్గరవుతున్నారు. స్థానికంగా జరిగే సమస్యలు, అభివృద్ధిపైనా తమ ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఆదివాసీ గూడెల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, వైద్యం, యువతకు ఉపాధి, తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే తాజాగా జరుగుతున్న ఘటనల్లో మాత్రం ముందస్తుగా అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి.

వేతన ఒప్పందాలు అమలు చేయాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను సింగరేణిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేతన ఒప్పందాలు అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. సింగరేణి కార్మికులకు కోలిండియాలో మాదిరిగా క్యాడర్ స్కీంను అమలు చేయాలన్నారు. మహిళా కార్మికులకు సామాజిక భద్రత, సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. యూనియన్ సభ్యత్వాలను ధ్రువీకరిస్తూ చెక్ సిస్టం నెలకొల్పి పారిశ్రామిక వివాదాల చట్టాన్ని అమలు చేయాలన్నారు. సింగరేణిలో కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ సాధించిన లాభాలను ప్రకటించి అందులో నుంచి కార్మికులకు 40 శాతం వాటాను పంపిణీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత, సంక్షేమం, పీఎల్ఆర్ బోనస్ తదితర అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు మాదాసి రవీందర్, గూడా శ్రీకాంత్, బోయిన మల్లేశ్, కట్కూరి సతీశ్, పగిడి శ్రీకాంత్, రాజేందర్ విజయ్, మహేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో ఓబీ పనులు చేసే సీఆర్ఆర్‌సంస్థ కాంట్రాక్టర్‌పై యాజమాన్యం చర్య తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు మస్టర్లు ఇవ్వకుండా ఇతర పనులు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై తాము ఇదివరకే ఓసీపీ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేయినా పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం స్పందించి ప్రతినెల 26 మస్టర్లు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని మాట వినకుంటే సదరు కాంట్రాక్టుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

9న ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం న్యూలోలంలో గల లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో ఈనెల 9న ఉమ్మడి జిల్లాస్థాయి బాల,బాలికల సబ్ జూనియర్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగ్రత్ ఈశ్వర్, ఎస్.శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హెచ్‌ఎం సురేశ్‌కుమార్, పీఈటీ రాకేశ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 13 నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

28న పంచాయతీల్లో ఫొటో ఓటరు తుది జాబితా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 28న తుది ఫొటో ఓటరు జాబితా సిద్ధం చేసి పంచాయతీల్లో ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారధి తాజాగా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13న ఫొటో ఓటరు జాబితా సిద్ధం చేయాలని, 18న అన్ని పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమావేశం, 19న ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఎంపీఓ, కార్యదర్శులతో మండల స్థాయిలో సమావేశాలు, 14 నుంచి 21వరకు పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలు, అభ్యంతరాల స్వీకరణ, 26న ఓటరు జాబితాలపై అభ్యంతరాల పరిష్కారం, 28న తేది ఫొటో ఓటరు జాబితాల ప్రదర్శన చేయాలని ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

8న ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ సదస్సు

పాతమంచిర్యాల: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈనెల 8న ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో కార్మిక సంఘాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్మికులు ఈ సదస్సుకు తరలిరావాలని కోరారు. సభ్యులు సురేందర్, మల్లన్న,సారయ్య,సాంబన్న రాజేశం, అరుణ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జరిమానా

దండేపల్లి: భూతగాదా విషయంలో ఒకరిపై దాడికి పాల్పడిన ఇద్దరికి జరిమానా విధిస్తూ మంచిర్యాల అడిషనల్ సబ్‌కోర్టు జడ్జి అర్పిత మారంరెడ్డి గురువారం తీర్పునిచ్చారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. 2021 ఆగస్టు 29న దండేపల్లి మండలం పెద్దపేటకు చెందిన బొడ్డు రాజన్నను అదే గ్రామానికి చెందిన రవీందర్, హరికృష్ణలు భూతగాదాల విషయంలో కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ చేశారు. కేసు విచారణ గురువారం పూర్తి కావడంతో, నిందితులిద్దరికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి ఈ మేరకు తీర్పు ఇచ్చారని ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి రవి తీర్పునిచ్చారని జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. గురువారం జైపూర్‌లో పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్‌పరీక్షలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాన్నాయిపేట గ్రామానికి చెందిన మెరుగు వెంకటేశ్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు కేసుకున్నారు. అనంతరం చెన్నూర్ కోర్టులో వెంకటేశ్‌ను హాజరుపర్చగా జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై గోపతి సురేశ్ కథనం మేరకు.. హాజీపూర్ మండలం దొనబండకు చెందిన మోతె సుధాకర్(48) బుధవారం ఉదయం నిద్ర లేచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు


పట్టుబడిన దొంగలు, బైక్‌లతో సీఐ బన్సీలాల్, సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లాలోని పలు ఏరియాల్లో బైక్‌లు దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఎస్సైలు సనత్, సురేశ్ సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. నిమ్మల కుమార్, నెల్లి సాయికుమార్‌లు ధ్రువపత్రాలు లేని బైక్‌లు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని విచారించగా మంచిర్యాల, లక్సెట్టిపేట, కాసిపేటలో పలు బైకులు దొంగిలించామని ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లతోపాటు చున్నంబట్టిలో ఓ ఇంట్లో దాచిన మరో నాలుగు బైకులు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుళ్లు సుబ్బారావు, శ్రీనివాస్, రమేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దం.. అ'పూర్వ' సమ్మేళనం


చెన్నూర్‌లో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

- 54 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి మిత్రులు
- ఏడు పదులు దాటిన పూర్వ విద్యార్థుల హాజరు

చెన్నూర్: అర్ధ శతాబ్దం క్రితం వారంతా ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత ఎవరి ఉన్నత విద్యవైపు అడుగులు వేస్తూ వేరయ్యారు. వీరిలో కొందరు వైద్యులుగా, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. 54ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మంచిర్యాల జిల్లా చెన్నూర్ వేదికైంది. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1970–71విద్యాసంవత్సరం చదివిన విద్యార్థుల సమ్మేళనం గురువారం స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో వైద్యులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వారణాసి చంద్రయ్య, పులి రామన్న, బోద్ చంద్రయ్య, అడ్వాల లచ్చయ్య, సయ్యద్ సాధిక్ అలీలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పురాణం శంకర్, టంకసాల రవీందర్, రుద్రభట్ల రంజన్, మహావాది రమేశ్, గన్ను పురుషోత్తం, గన్ను శ్రీరాములు, డాక్టర్ సుడిగాల రవీంద్రనాథ్ సూరి, కసోజ్జల కమలాకర్, నాగోతు సత్యనారాయణ, రాజేశ్వరిరెడ్డి, లింగయ్యతోపాటు మరో 40 మంది పాల్గొన్నారు.

జోరుగా 'చికున్ గున్యా'

- ఆసుపత్రిలో జ్వరపీడితులు
- బెడ్‌కు ఇద్దరు చొప్పున వైద్యసేవలు


చికిత్స పొందుతున్న రోగులు

చెన్నూర్: చికున్ గున్యా జ్వరాలు జోరందుకున్నాయి. చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం జ్వర పీడితులతో కిటకిటలాడుతుంది. 100 పడకలు నిండడంతో మరో 15 పడకలు రిపేర్లు చేయించి సమకూర్చారు. అయినా పడకలు పరిపోకపోవడంతో ఒక్కో బెడ్‌కు ఇద్దరు రోగులను ఉంచి సెలైన్లు ఎక్కించాల్సిన దుస్థితి నెలకొంది. గురువారం 300లకు పైగా రోగులు వివిధ పరీక్షలు చేయించుకోగా, 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.సత్యనారాయణ మాట్లాడుతూ రోజురోజుకు జ్వర పీడితులు పెరుగుతున్నారన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు జ్వరాలతో బాధపడుతుంటే ఒకే బెడ్ ఇచ్చి వైద్యం చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా 'సర్వేపల్లి' జయంతి


నివాళులు అర్పిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, శ్రీపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల


ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేతతో గోదావరిలోకి భారీగా చేరుతున్న వరదనీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదనీటితోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోంది. గురువారం గుడిపేట శివారులోని గోదావరిపై ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం 148 మీటర్ల క్రస్టు లెవెల్‌కు గాను 145.60 మీటర్లు ఉండగా మొత్తం 20.175 టీఎంసీలకు గాను 16.100 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లో ద్వారా 1.70 లక్షల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 25 వేల క్యూసెక్కులు, కడెం నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులో కలుస్తోంది. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 316 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోని 32 గేట్లు తెరిచి 1.65 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.